# భక్తజన సంద్రంగా యాదగిరిగుట్ట



అష్టోత్తర శత ఘటాభిషేకంలో భాగంగా కలశాలను తీసుకొస్తున్న ఉప ప్రధానార్చకుడు మాధవాచార్యులు, ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి

- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు, వ్రత మండపం
- 70వేల మంది భక్తుల రాక
- ఆలయానికి రికార్డు స్థాయిలో రూ.1.09కోట్ల ఆదాయం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 10 : పంచనారసింహుడి క్షేత్రం యాదగిరిగుట్ట ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఎటుచూసినా భక్తుల కనిపించారు. 'నమో నారసింహాయా' అంటూ స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. కార్తీక మాసం చివరి ఆదివారంతో పాటు సెలవు దినం కావడంతో స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరుమాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు భక్తులతో సందడిగా మారాయి. వీఐపీ, బ్రేక్ దర్శనాల్లో 3,618మంది భక్తులు పాల్గొనడం విశేషం. ధర్మ దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూ కాంప్లెక్స్ మూడు అంతస్తులతో పాటు క్యూలైన్లు నిండిపోయాయి. వీవీఐపీ దర్శనానికి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రసాద విక్రయశాలతో రూ.34,31,490 ఆదాయం సమకూరింది. కొండపైకి వాహనాల రద్దీ సాగింది. పార్కింగ్ ప్రాంతంతో పాటు కొండపై వివిధ ప్రాంతాల్లో వాహనాలతో రద్దీగా మారింది. దీంతో భక్తులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వెంటనే స్పందించిన ఆలయ అధికారులు, పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను రద్దీని అదుపులోకి తీసుకొచ్చారు. స్వామి వారి ధర్మ దర్శానికి 5గంటలు, వీఐపీ దర్శనానికి 4గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేదాశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవమూర్తిని అర్చించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 1594 మంది భక్తులు వ్రత పూజల్లో పాల్గొన్నారని తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శత కలశాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు నిత్యోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వెండి మొక్కు జోడు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని సుమారు 70వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.1,09,40,868 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.



అష్టోత్తర శతఘటాభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు

# మానవ నిర్మిత గొప్ప రాతి కట్టడం సాగర్



నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన పిల్లర్ వద్ద ఎన్ఎస్పీ అధికారులు, ఉద్యోగులు, డ్యామ్ నిర్మాణంలో పని చేసిన సిబ్బంది, కూలీలు

- ఎన్ఎస్పీ డీఎస్ఈ నాగేశ్వర్‌రావు
- డ్యామ్‌కు పునాది వేసిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

నందికొండ, డిసెంబర్ 10 : ఆధునిక దేవాలయంగా పేరొందిన నాగార్జునసాగర్ డ్యాం మానవ నిర్మిత గొప్ప రాతి కట్టడమని ఎన్ఎస్పీ డీఎస్ఈ నాగేశ్వర్‌రావు అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు పునాది వేసి నేటికి 68ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పైలాన్‌కాలనీలోని డ్యాం శంకుస్థాపన పిల్లర్ వద్ద ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1955లో సాగర్ డ్యాంకు పనులు ప్రారంభమై 12ఏండ్లు కొనసాగాయని తెలిపారు. సుమారు 40వేల మంది కార్మికులు నిరంతరాయంగా పనిచేయడంతో 1967సంవత్సరంలో పూర్తైందన్నారు. స్వదేశీ ఇంజినీర్ల పరిజ్ఞానంతో, లక్షలాది మంది కూలీల మానవశక్తితో నిర్మించిన రాతి ఆనకట్టల్లో సాగర్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే మొదటిదని పేర్కొన్నారు. సాగర్ ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన కుడి, ఎడమ కాల్వలతో లక్షల ఎకరాల సాగుతో పాటు తాగు నీటి అవసరాలు తీరుతున్నాయన్నారు. ఈ సారి డ్యాంలో నీరు పుష్కలంగా లేదని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఈ మల్లికార్జున మాట్లాడుతూ సాగర్ డ్యాం రూపకల్పన విశేషాలు, డ్యాం నిర్మాణ సమయంలో అధికారులు, సిబ్బంది పనితీరు వివరించారు. డ్యాం నిర్మాణం పటిష్టంగా ఉందని, మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టామన్నారు. 68ఏండ్లు పూర్తి చేసుకున్నా వరదలను తట్టుకుంటూ డ్యాం పటిష్టంగా ఉందని, డ్యాం నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్న ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అంతకుముందు అమరవీరుల స్తూపం, డ్యాం నిర్మాణ ఇంజినీర్ మీర్‌జాఫర్ అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విఘేశ్వర ఆర్కెస్ట్రా వారు ఆలపించిన ఆ నాటి మధుర గీతాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈలు సుదర్శన్‌రావు, శ్రీనివాస్, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ, అనిత, ఎస్పీఎఫ్ ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, ఏఎస్ఐ పుల్లయ్య, హెచ్ఎంలు శ్రీనివాస్, రాములు, నాయకులు సాంబశివరావు, జంగయ్య, శ్రీనివాస్, ఎన్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికా బౌద్ధ పరిశోధకులు బుద్ధవనం సందర్శన

నందికొండ హిల్ కాలనీలోని బుద్ధవనాన్ని అమెరికా దేశంలో ఉంటున్న బౌద్ధ పరిశోధకులు భాస్కర్, నగేశ్ ఆదివారం సందర్శించారు. బుద్ధవనంలోని బుద్ధవనం, జాతక పార్కు, స్తూపవనం, మహాస్తూపం, ధ్యాన మందిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధవనంలో శిల్పాలు తమను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో బుద్ధవనం అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. బుద్ధవనాన్ని సుందరంగా తీర్చిదిద్దిన బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వీరికి బుద్ధవనం విశేషాలను బుద్ధవనం బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్, కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు.



బుద్ధవనం విశేషాలను బౌద్ధ పరిశోధకులు భాస్కర్, నగేశ్‌కు వివరిస్తున్న ఈమని శివనాగిరెడ్డి



శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# వృక్ష జాతిని సంరక్షించాలన్నదే వన సమారాధన

- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 10 : ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వన భోజనాలు మనకు చాటి చెబుతాయని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంతోషి రూపాదేవి ట్రస్టు పాత సూర్యాపేట స్టేజీ సమీపంలోని ఫల క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శివలింగాలకు మహాన్యాస ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతీ, సంప్రదాయాలు, హైందవ ధర్మ మార్గాన్ని అనుసరించి అనాదిగా వస్తున్న ఎన్నో పర్వ దినాలను మనం పాటిస్తూ వస్తున్నామన్నారు. ఇందులో భాగమే కార్తీక మాసంలో జరుపుకొనే వన సమారాధన కార్యక్రమమని పేర్కొన్నారు. భారతీయ ఆయుర్వేదంలో వృక్ష జాతికి ఉన్న ప్రాముఖ్యం అందరికీ తెలిసిన విషయమేనని, అందుకే మంచు కురిసే సమయంలో ఉసిరి చెట్టు కింద విష్ణువును పూజించి వండిన ఆహారాన్ని ఆ చెట్టు కిందే ఆరగిస్తే కార్తీక మాసంలో గొప్ప పుణ్యఫలం దక్కుతుందని కార్తీక పురాణం చెబుతుందన్నారు. కేవలం బోజనాలకే పరిమితం గాక, ఆటలు, పాటలు, కబుర్లకు ఇది చక్కటి వేదిక అన్నారు. పిల్లలు, పెద్దల్లో ఉన్న సృజనాత్మకతను తట్టి లేపే క్రీడలు, నృత్యాలు, సంగీత కచేరిలు నిర్వహించడానికి మంచి అవకాశమన్నారు. భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చే వృక్ష జాతిని సంరక్షించాలనే నిగూఢ సందేశాన్ని వన సమారాధన అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్ల స్వర్ణలతాచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, బత్తుల రాజేంద్రప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ ముద్దం కృష్ణారెడ్డి, మిర్యాల వెంకట్‌రెడ్డి, బ్రహ్మం, సంతోషీమాత ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశంగుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.




సౌత్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జి.ఉపేందర్‌రెడ్డి

# వెయిట్ లిఫ్టింగ్‌లో ఎంజీయూ విద్యార్థికి గోల్డ్ మెడల్

- అభినందించిన ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి
- వేర్వేరు విభాగాల్లో జాతీయ స్థాయికి ముగ్గురు విద్యార్థులు

రామగిరి, డిసెంబర్ 10 : ఏపీ రాష్ట్రంలోని రాజమండ్రిలో గల ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న అంతర యూనివర్సిటీ సౌత్ వెస్ట్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన 73కేజీల విభాగంలో నల్లగొండ ఎంజీయూ అనుబంధ కళాశాల విద్యార్థి రామినేని శివలింగేశ్వర సాయి గోల్డ్‌మెడల్ సాధించాడు. అతడు కోదాడలోని సాయి వికాస్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. అదేవిధంగా 73కేజీల విభాగంలో మోక్షజ్ఞ సాయి, 67కేజీల విభాగంలో ఎస్.వేణుగోపా(కోదాడ కేఆర్ఆర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా జనవరి 24నుంచి 27వరకు జలంధర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంజీయూ అధికారులు తెలిపారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జి.ఉపేందర్‌రెడ్డితో పాటు స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి రాజమండ్రి వెళ్లి విద్యార్థులను అభినందించారు.

### జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వీసీ అభినందన

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు శివలింగేశ్వర సాయి, మోక్షజ్ఞ సాయి, ఎస్.వేణుగోపాల్‌కు ఎంజీయూ వీసీ సీహెచ్.గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవితో పాటు ఎంజీయూ వివిధ విభాగాల అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఎంజీయూలో ఆధునిక టెక్నాలజీతో అందుబాటులో ఉన్న క్రీడామైదనాలు ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణలోని మిగిలిన యూనివర్సిటీల కంటే భిన్నంగా ముందుస్తుగానే స్పోర్ట్స్ క్యాలెండర్ విడుదల చేసి దానికి అనుగుణంగా క్రీడలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చదివే కళాశాలల యాజమన్యాలు, ప్రిన్సిపాళ్లు, పీడీలు, అధ్యాపకులకు సైతం అభినందనలు తెలిపారు. మిగిలిన విద్యార్థులు సైతం వీరిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఉత్తమంగా రాణించాలని కోరారు.